# మన్మథ శాపము



జోళ్ళు. చేతిలో గొడుగు లేనిది ఎక్కడికైనా పోవటం అపచారం అంటుంది. ఎప్పుడయినా 'లిప్‌స్టిక్' తీస్తే వాళ్ళమ్మ వచ్చి "ఎన్నెవరైనా పెళ్ళి చేసుకోవాలా?" అని వాళ్ళ నాన్నను వాలుగు అని పెట్టెలో పెట్టి వేస్తుంది. సుశీలమటుకు "సరే! సరేనన్ను మెడ్రాసులో ఎవరు అడ్డుపెడతారు? నాన్సెన్సు!" అని పళ్ళు బిగబట్టి గట్టిగా అరిచేది. శ్రీనివాసులుమటుకు నోరు మెదిపేవాడుకాదు. సుశీల ఇక అక్కడినించి లేచి గ్రామఫోన్ పెట్టుకోవటమో లేక నవలలు చదువుకోవటమో చేసేది. కృష్ణ అప్పుడప్పుడు సుశీలను కిటికీలోనించి చూసి మురిసిపోయేవాడు. సుశీలమటుకు ఆ ఆకారం కిటికీలో కనపడినప్పుడల్లా మనిషా? బొమ్మా? అని ఆలోచించేది. ఆరోజు ఉదయం సుశీల కిటికీలోనించి చూసి కృష్ణకు పనిమనిషిచేత కబురు పంపింది. అతడు ఒక్కసారి ఆశ్చర్యపోయాడు! పక్కింటికి ఎట్లా వెళ్లాలో కూడా మరిచిపోయాడు. అయిదు నిమిషాలు గడిచాయి. కృష్ణవచ్చి సుశీల ముందు నిల్చున్నాడు. "పిలిచారట!" అన్నాడు సందేహిస్తూ. సుశీల "మీకు మాటలు కూడా వచ్చా?" అంది. కృష్ణ సిగ్గుపడ్డాడు.

కుర్చీలో కూర్చుని ఆ ఇంట్లో ఉన్న పరికరాలు పరిశీలించాడు. సుశీల పుస్తకాల బీరువా, చిన్నటేబిల్ మీద టాయిలేట్ సామాను, మూలగా ప్రేంకుర్చీ, దానిలో మాగజైన్సు, దానికి కొంచెం పక్కగా రకరకాలైన జోళ్ళు, దానిపక్కనే స్టాండుకు గౌను! "మీరు గౌన్లు వేస్తారా?" అన్నాడు ఆశ్చర్యపోతూ. "మీరు భోజనంచేస్తారా?" అంది కోపంగా. కృష్ణకు కోపం వచ్చింది. తనను ఒక పశువుగా ఎంచుతూంది అనుకున్నాడు. అతనికి ఏంమాట్లాడాలో తోచక గబగబా బయటికి వచ్చేశాడు.

మధ్యాహ్నం అన్నాలవద్ద తను చేసిన ఘనకార్యం అందరికీ చెప్పి నవ్వింది. "ఫూల్! ఫూల్!" అంది పదిమార్లు. వాళ్ళమ్మమటుకు సుశీల చేసింది తప్పంది. శ్రీనివాసులుమాత్రం ఏమి మాట్లాడలేదు. రెండు

# మన్మథ శాపము

గంటల తరవాత వళ్లెటూరికి బస్సుకి ఎంతో తేడా ఉందని చెప్పి ఆఫీసుకు వెళ్లాడు. అమ్మాయికి పల్లెటూరు వాతావరణం అలవాటు చెయ్యాలని తను ఆ ఊరుతీసుకువచ్చానని భార్యకు చెప్పాడు. సుశీలకు ఆరోజు ఏమీ తోచలేదు. కిటికీలో ఆకారమూ కనపడలేదు. ఆరోజు రాత్రి ఆ అబ్బాయి ఏం చదువుకున్నాడని అడిగింది. బి. ఎల్. అని వాళ్లనాన్న సమాధానం చెప్పాడు. ఆమె ఆశ్చర్యపడలేదు. "అందుకే! అందుకే!" అన్నది హేళనగా.

ఆ ఊళ్లో ప్రతి సంవత్సరం హైస్కూల్లో 'స్కూల్ డే' చేస్తారు. ఆరోజున సుశీల చక్కగా ముస్తాబయింది. వాళ్లమ్మ శ్రీనివాసులుతో "ఈ ఊళ్లో అమ్మాయిని అంతా అదోరకంగా చూస్తున్నారు! తోడువెళ్లండి!" అంది. అక్కడికి చేరేసరికి ఆరుగంటలయింది. శీతాకాలం పొద్దు. అప్పుడే నాటకానికేమో తెరలేచింది. నాటకంకాదు. అప్పుడే మీటింగు అని హెడ్మాస్టరు మైకులో అరిచాడు. అంతేకాకుండా "శ్రీ కృష్ణ బి. ఎ. బి. ఎల్. మాట్లాడతారు" అన్నాడు. కృష్ణకు సుశీలను చూసేసరికి ఆ కాస్త మాట కూడా రాలేదు. ఎట్లాగో మీటింగు అయిందనిపించాడు. సుశీల మీటింగు అయిన తరవాత దారిలో పలకరించింది. "హల్లో!" అంది. కృష్ణ మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నాడు. "మీరు లా పాసు అయినారా" అంది. కృష్ణ కోపంగానవ్వాడు. "మీరు ప్రాక్టీసు మానేసి ఏదైనా బిజినెస్ చేసుకోవటం మంచిది" అన్నది. శ్రీనివాసులు ఖిన్నుడై నిలుచున్నాడు. "మీ సలహాకు థాంక్సు" అంటూ నిలవకుండా కోపంతో వెళ్లిపోయాడు కృష్ణ.

ఆరోజు సాయంత్రం శ్రీనివాసులు కృష్ణ ఇంటికి వచ్చేసరికి వాళ్ల నాన్న గోవిందరాజులు వీధి అరుగుమీద కూర్చున్నాడు. శ్రీనివాసులు నమస్కారం చెయ్యగానే ఆప్యాయంగా పిలిచి తనపక్కన కూర్చోమన్నారు. శ్రీనివాసులు చిన్నముఖంతో "మా అమ్మాయి కాన్వెంటులో చదువుకోవటం మూలంగా అట్లా మాట్లాడుతుంది. మీ అబ్బాయిని ఏమీ అనుకోవద్దనండి!" అన్నాడు. గోవిందరాజులు నవ్వి "మా అబ్బాయి జీవితం బాగుపడాలంటే ఇట్లాంటి అమ్మాయి కావాలని నేను అనుకొనేవాణ్ని, మీరు ఏమి అనుకోకపోతే! నాకు చాలా సంతోషం!" అన్నాడు. శ్రీనివాసులు ముఖం చేటంత చేసుకొని ఇంటికి వచ్చాడు.

ఎట్లా అయితేనేం? ఆషాఢ శుద్ధ ఏకాదశి సోమవారం కృష్ణ సుశీలకు పెళ్లి వైభవంగా జరిగిపోయింది.

## 3

ఆరోజు ఉదయం సుశీల ఘాటుగా సాతనూరు ప్లెజర్ ట్రిప్పు వేయవలసిందిగా ఆర్డరు పాసుచేసింది. నూతన దంపతులు రాధామోహన్‌లు గుడ్డలు సర్దడం మొదలుపెట్టారు. పౌడరు డబ్బాలు, స్నోలు, షిఫాన్, నైలాన్ చీరలు, అద్దాలు, దువ్వెనలు, ఉడకులాం సీసాలు, సెంటుసీసాలు అన్నీ పెట్టెలో పెట్టాలా లేదా అని కొంతసేపు తర్కించుకున్నారు. సుశీల వంట ప్రయత్నంమీద హోటల్కి ఇంటికి పనిపెట్టి తిరిగింది. రాధామోహన్‌ల మధ్య ఆ సర్దటంలో చిన్న పేచీ, అభిప్రాయాలు కలిసి, కళ్లలో ఘాటుగా చూసుకోవటాలు, చిన్నగా గిల్లుకోవడాలు లాంటి సరసాలు జరిగాయి. మధ్య మధ్య న్యాయం చేకూర్చవలసిందిగా రాధ వదినెగారివద్దకు సిఫార్సుకి వెళ్లింది. అంతగలాటా ఇంట్లో జరుగుతున్నా నిశ్శబ్దంగా ఏదో నవల చదువుకుంటూ కూర్చున్న కృష్ణను చూసి ఈర్ష్యపడింది సుశీల.

ఆఖరికి నాలుగు సూట్‌కేసులు చూపి రాధ "మావన్నీ అయినట్లే వదినా!" అంది. సుశీల "నాదీ అయిందే!" అంది. మధ్యాహ్నం భోజనాలు కారియర్‌లో అమర్చింది. "మా అన్నయ్యకు ఏమైనా కావాలేమో కనుక్కో!" అంది రాధ ఊరుకోలేక.

"అయ్యో ఖర్మ! చాలు చాలు!" కృష్ణ గదిలోకి చరచరా నడిచింది. "ఏమండీ! వెళదామా!" అంది. గదిలో ప్రవేశించింది. అక్కడ కృష్ణ కనబడలేదు. గది అంతా రెండు మూడుసార్లు వెదికింది. అదేమీ ఆమెకు కొత్త కాదు.

పెళ్లి అయిన తరవాత కృష్ణ బాధ్యత అంతా సుశీల తనే వహించేది. "'కృష్ణుడు ప్రాణంకల బొమ్మ!" అంటాడు వాళ్లనాన్న. పుస్తకాలు రాక్‌లోనించి తియ్యటమే కాని అందులో ఉంచాలని జ్ఞప్తి ఉండదు! బజారుకు వెళ్లాలంటే జోళ్లువేసుకుకోవాలని రోజూ సుశీల చెప్పేది.

రోజూ ఉదయం ఆరుగంటలకు లేపాలి. ఉదయాన్నే స్నానం చేయవలసిందని మరీ చెప్పాలి. స్నానంచేసిన తరవాత ఏంచేయాలో అతనికి తోచదు. బట్టలు వేసుకోవాలంటే అనుమానం. ఏవి వేసుకుంటే ఏమి వస్తుందోనని కృష్ణ వేసుకునే బట్టలు కొన్నిసార్లు సుశీలకు నచ్చవు. "అబ్బ! ఆ పాంటు ఎందుకు వేసుకున్నారు! తీసివేసి ట్వీడ్‌సూట్ వేసుకోండి! అసలు, తెల్లపాంటుమీదికి నల్లబూట్లు వేసుకోవాలి! అయ్యో! ఖర్మ! మీకు అన్నీ చెప్పాలి!" అంటూ ఉండేది. వీటన్నిటికీ ఒకటే ఉపాయం ఆలోచించాడు కృష్ణ. అదే మౌనం. ఆమె ఏంచెబితే అదిచెయ్యడం, ఏం చేతికిస్తే అవి తీసుకోటం అతను నేర్చుకున్న విద్యలు! సుశీల అతనికి గురువు, భార్య కూడా!

సుశీల గదిలోనించి వసారా దాటి చిన్నగా తోటలోకి పోయింది. అడుగులో అడుగు వేసుకుంటూ ఆనాడు 'గోపిక'లా ప్రతిచెట్టు ప్రతిపుట్ట గాలించింది. ముందటి వైపు బారుఅంతా గులాబీచెట్లు. ఆ తరవాత మల్లెపొదలు. రకరకాల మరెలు. ఆ తరవాత జాజి సంపెంగ పొదలు బాగా ఎత్తుగా పెరిగాయి.

ఆ తరవాత ఉత్తరపు దిక్కుగా నన్నజాజులు, మందారాలు, పొన్నలు. అక్కడ సుశీల ఒక్కక్షణం ఆగి తేరిపార చూసి 'ఎక్కడమ్మా కృష్ణుడు!' అనుకున్నది. అటునించి కుడివైపుగా చక్కగా అమర్చిన టేబిల్ 'రోజా'. టచ్ మీ నాట్. ఫర్గెట్ మీ నాట్!


కృష్ణ అటుపక్కగా ఫర్గెట్ మీ నాట్ పక్కనే కూర్చుని చదువుకుంటున్నాడు నిశ్శబ్దంగా. మెల్లిగా దగ్గరికి వెళ్లింది. ఆనాడు గోపికో, రాధో అయితే చల్లగా గాజులు చప్పుడు కాకుండా వెళ్లి కళ్ళుమూసేది. 'నాకు అపచారం చేస్తావా?' అని బుంగమూతి పెట్టి కోపం నటించేది. కాని, సుశీల అడుగులు కొంచెం కోపంగా పడ్డాయి. వెళ్లివెళ్లటంతోటే కృష్ణ చేతిలోని పుస్తకం గభాలున లాక్కుని గిర్రున వెనక్కి తిరిగింది.

ఇంకేం! సిరికిం చెప్పడు!...సుశీల సరాసరివెళ్లి గారేజ్ తెరిచి కారు బయటపెట్టింది. "మనం సాతనూరు వెళుతున్నాము" అని పెద్దగా అరిచి చెప్పింది. కారులోకి పుస్తకం విసిరికొట్టింది. రాధామోహన్‌లు టప్‌టాప్‌గా అలంకరించుకుని కూర్చున్నారు.

కారు కొండ మలుపులు తిరిగింది. పల్లెలు దాటింది. ఎత్తైన గుట్టలు ఎక్కి పల్లాలు దిగింది. పశువుల మందలు దాటి చిన్న ఊళ్లలో వింతగా చూసే ఆడపిల్లల్ని దాటింది. జింజికోట దాటింది. అప్పటికి మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. రాధామోహన్‌ల ముఖారవిందాలు ఆకలితో ముడుచుకున్నాయి. తిరువణ్ణామలైలో కాసేపు రమణాశ్రమం చెట్ల నీడలో కారు ఆపారు. కృష్ణ పుస్తకంతో ఒళ్లు మరచుకుని భోజనం ముగించాడు. రాధామోహన్‌లు కాసేపు ఆశ్రమ విశేషాలు చూసివచ్చారు. నెమళ్ళు, గోరువంకలు, చిన్న చిన్న కోతులు, పెద్ద పెద్ద గడ్డాల మనుషులు! అన్నీ సరదాగా చూశారు. మూడుగంటలకి కారు మళ్లీ బయలుదేరింది.

## వర్షంలో వనిత

చిత్రం—పీరిశెట్టి అచ్యుతరావు (పుశ్చేటికుర్రు)



కారు దుమ్ము లేపుకుంటూ, సాతపూరు డాము దాటి 'గెస్టుహౌస్' వద్ద ఆగింది. రాధామోహన్‌లు ఆనందంతో ఒళ్ళు విరుచుకున్నారు. రాధ ఎక్కడైనా డ్రెస్సింగ్ రూము ఉందేమోనని విచారించింది. స్టీరింగ్ పట్టి దిగి ఒక్కసారి కృష్ణనుచూసి ఆవలించింది. మోహన్ "బావకికొంచెంసేపుఇవ్వకూడదూ!" అన్నాడు. "కాదే! అక్కర్లా! రేపు ఈపాటికి చేరినా మనం చేరినట్టే!" అన్నాడు. మోహన్ నవ్వాడు. రాధ మోహన్‌లా నవ్వటానికి ప్రయత్నించి పెదిమలు కొంచెం తెరిచి మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినదానిలా బాత్‌రూములోకి పరిగెత్తింది. కృష్ణ మళ్ళీ తన పుస్తకం తీసి చదువు ప్రారంభించాడు.

రాధ ఒక్క గంటలో మెరుపుతీగ మాదిరి మెరిసింది. మోహన్‌మటుకు తను వేసుకున్న పసుపుపచ్చని టెరిన్ ప్లాజా తెల్లని ట్వీడ్ నప్పాయో లేదో అని గాబరాపడ్డాడు. సుశీల తనకు నచ్చిన పీలిరంగు చీర, తెల్లని జాకెట్టు వేసుకుంది. రెండు జడలు తీసివేసి జుట్టు మొదట్లో పసుపు పచ్చని రిబ్బను కట్టింది. ఆ మాదిరిగా కట్టటానికి జుట్టు చాలదేమోనని భయపడి రాధ రెండు జడలు వేసింది. కృష్ణ మొత్తం తెలుపు వేశాడు. ఆమె చెప్పిన ప్రకారం నల్లబూట్లు వేసుకున్నాడు. అసలే పచ్చని శరీరం, బంగారంరంగులా మెరుస్తాంది సూర్యకాంతికి. రాధ జాకాలుతీసి రింగులు తగిలించింది చెవులకు. బంగారు గాజా పైకితీసి మట్టిగాజులు రకరకాలైనవి ఒకచేతికి అలంకరించుకుని వేరేచేతికి ఒక్క గాజుమాత్రం ఉంచింది. కృష్ణ తన రింగుల జుట్టు సాపుచేసుకుని పాత పుస్తకం దుమ్ము దులిపాడు.

సుశీల పెళ్ళినాడు కృష్ణతో ఏమైనా పరాచికాలు ఆడిందో లేదో తెలియదు కాని, ఆ తరవాత మట్టుకు నాటినా హేళన చేసింది. కాని, మనస్సులోమట్టుకు దేవుడు తనకు అటువంటి భర్తను ప్రసాదించినందుకు రహస్యంగా మొక్కుకునేది.

మగవాళ్ళంటే ఆమె మనస్సులో ఎంత నిర్లక్ష్యమో కృష్ణ అంటే అంత ప్రేమ మనస్సులో దాచుకుంది. సుశీల ఒకొక్కసారి హిందూధర్మశాస్త్రం ప్రకారం తను భార్యగా ఎంతో అపచారం చేస్తున్నట్టు విచారించేది. "నేనో పిచ్చిదాన్ని! నేనో పిచ్చిదాన్ని" అని నవ్వుకునేది. తన అనుబంధం ఏనాడో ఎంతో పుణ్యం వల్ల ఏర్పడినదని, కృష్ణ ఓర్పు, అతని మంచితనం అన్నీ తెలిసి కూడా ఏమీ తెలియనివాడులా ఉండే మనస్తత్వము చూసిపులకరించేది. అతని కాళ్ళమీద పడి ఎప్పుడో ఒకనాడు తనను క్షమించమని కోరాలను కునేది. కాని, సమయం రాలేదు.

ఏది ఏమైనా, ఆ రమ్యమైన ప్రకృతిలో మన్మథుడు సపరివారంగా ఉన్న ఆ సమయంలో సుశీలకు కృష్ణనించి ఏమాత్రం కూడా సుఖం లభించలేదు. ఆ సంగతి మనస్సులో మెదలినప్పుడల్లా ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేవి. ఆమె ఏదో అలోకంలోకి దిగజారి పోతున్నట్టుగా అనుమానించేది.

రాధామోహన్‌లు అలా వెళ్ళి వస్తామని చెప్పి తిన్నగా జారుకున్నారు. కృష్ణ కారువద్ద వచ్చిక మైదానంలో పుస్తకం చదువుకుంటుంటే సుశీల శూన్యంలోకి మూగగా చూసింది.

సాయంత్రం అరుణమయింది. సుశీల బాధ చూడలేక సూర్యుడు పడమటి కొండలోకి జారిపోయాడు. డాము పరిసరాలన్నీ ఒక్కసారిగా రకరకాల రంగుల దీపాలతో వెలిగిపోయాయి. అంతకంటే చిత్రవిచిత్రమైన పూలమొక్కలు, పాదలు భూమిన నక్షత్రాల్లా మెరిసిపోయాయి. రాధామోహన్‌లు స్విమ్మింగ్ పూల్‌వద్ద కొంతసేపు గడిపి, మన్మథుడి మలయమారుతానికి జారిపోయే దుస్తులు సర్దుకుని, కాస్సేపు లేడిని, జింకను పరీక్షించి, ఫౌంటెన్‌వద్దకు వచ్చారు. అక్కడ రాధాకృష్ణులు చిన్న సరస్సు మధ్య ఉన్నారు. అప్పటినించి నీళ్ళు రంగుదీపాలమధ్యగా తెలుపు, ఎరుపు, పసుపు రంగులు వెదజల్లుతూ ప్రవహిస్తాయి. అక్కడ రాధ మోహన్ చెయ్యి తన చేతిలోకి తీసుకుంది.

సుశీల దూరంగా ఉన్న ఆ లైట్లను చూస్తూ కృష్ణతో ఒక్కసారి అలా పోయివస్తానని చెప్పి తన భాగ్యానికి తనే నాలుకకరుచుకుంది. కృష్ణ దీక్షంగా చదువుతూ "సరే" అన్నాడు. సుశీల కోపంతో విసవిస నడిచిపోయింది.

కృష్ణ ఎంతైనా లా చదువుకున్న వాడవటంచేత సుశీల ఎలా పోతున్నదో గ్రహించలేకపోలేదు. కాని ఆమెను ఆపగల శక్తి తనకు ప్రసాదించవలసిందని భగవంతుణ్ణి కోరుకున్నాడు. కాని, తన అసమర్థతకు కృష్ణకే అసహ్యం వేసింది. "ఈవేళా పోతూంది! స్వర్గం పోతూంది!" అని బాధపడ్డాడు. మిల్టన్ జ్ఞాపకం వచ్చాడు. ఆ తరవాత హెలెన్‌ఆఫ్ ట్రాయ్, ఒఫీలియా, డాంటే బియాట్రిస్, కీట్సు ఇజబెల్లా కనపడ్డారు.

అక్కడినించి లేచి సరిగా వసంత వనంలో ఒక పూలపొదలో ఒంటరిగా కూర్చున్నాడు. అతని కెందుకో అనుకోకుండా మనస్సు చలించింది. ఆడవాళ్ళమీద ఆలోచనలు అలలుగా పొంగిపోయాయి. అతని కళ్ళ ఎదట ఇప్పుడు కనపడే ప్రకృతి ఇందాకటిది కాదు. వసంతవనం! రమ్యాతిరమ్యమైన శిలలు! చంద్రకాంత వేదికలు! రంగు రంగు చీరలతో విహరించే దంపతులు దేవతలు! దేవకన్యలు, రంభలు, ఊర్వశులు, నలదమయంతులు, శకుంతలా దుష్యంతులు, రతీమన్మథులు! అప్పుడు అతనికి సుశీల జ్ఞాపకానికి వచ్చి విచారం కలిగింది. కృష్ణ ఒక్కసారిగా తన అభాగ్యానికి చింతించాడు. జీవితంలో అంతకంటే నరకం లేదనుకున్నాడు. తన గత జీవితాన్ని తలుచుకుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అలా ఉప్పొంగే ఉద్రేకంతో శూన్యంలోకి దిగులుగా చూశాడు. అతనికి ఒళ్ళంతా చెమటలు పోసింది. మనస్సు నీరసపడిపోయింది.

ఆ క్షణంలో అతనిముందు ప్రకృతిలోని అందం అంతా పుణికిపుచ్చుకున్న అందాన్ని చిలకరించే ముఖంతో ఒక యువతి నిలబడింది. నీలాలలా ఆమె మెరిసే కన్నుల్లో నీళ్ళచారలు! కృష్ణ ఆశ్చర్యంతో ఆమెను మనసారా దీవించాడు! అంతులేని ప్రేమతో నిష్కల్మషమైన హృదయంతో పొంగివచ్చే అనురాగంతో ఆ ముగ్ధమోహనమూర్తి రెండు కరాలు చాపింది. కృష్ణ సిగ్గుతో తలవంచుకొని ఆమె గుండెల్లో తన వేడికన్నీరు దాచుకున్నాడు.

ఆ క్షణంనించి భగవంతుడు ఏం మాట అన్నాడో కాని, సుశీల తన వ్యక్తిత్వం మరిచిపోయి, అతని దాసిగా మారిపోయి, ఆ భాగ్యానికి ఎంతో మురిసిపోయింది! ★

# వేంకటేశ!

## శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

ఎవరు చేరరాని ఏడుకొండల మీద
కూరుచుంటి వదియె గొప్పగాగ;
భక్తియనెడి రాచబాట మాకున్నది
వేగ నిన్ను జేర వేంకటేశ!

మ్రొక్కుబడుల పేర మూటలు గట్టించి
పెండ్లియప్పు దీర్చు పెద్ద వీవు;
పిడికెడటుకులంది వివిధ సంపద లిచ్చు
ప్రేమమూర్తి వీవె వేంకటేశ!

సుధ లొసంగువేళ సుందరివైనావు,
చేడెవగుచు సోది చెప్పినావు,
భక్తురాలికొరకు భామినివైనావు
వేసమేల నీకు వేంకటేశ!

మ్రొక్కు దీర్పలేని దిక్కుమాలినవారి
పైని సహజము కద వంతగింపు;
కోపగించు తండ్రి పాపని లాలించి
ప్రీతి ముద్దుగొనడె వేంకటేశ!

కష్టకాలమందె దృష్టికి వత్తువు
ప్రతిదినమ్ము నీ తలంపె లేదు;
అంతమాత్రమునవె అరయుచుండుపు కృపా
వీక్షణముల మమ్ము వేంకటేశ!

మానహాని ప్రాణహాని తటస్థించు
వరకు ద్రుపద సుతను గరివరేణ్యు
గావనట్టి నీదు కఠిన పరీక్షలు
విడిచిపెట్టు మింక వేంకటేశ!

కలియుగాన లోక కల్యాణము నొసంగు
దైవమీవె యనుచు దలతుము గద;
యుద్ధభీతి మాన్పి ఉర్వి శాంతిని గూర్చి
పేరు నిలుపుకొనుము వేంకటేశ!